# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 20-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే అతిసార వ్యాధి వ్యాప్తి చెందిందని ప్రాథమికంగా గుర్తించామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- ❖ అమరావతి పునర్నిర్మాణాన్ని పునరుజ్జీవంగా భావిస్తున్నట్లు పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.
- ❖ రాగల 24 గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతం, ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.

========================

యువకుడి పెట్రోల్ దాడిలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ రోజు మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమం వేదికగా ముఖ్యమంత్రి స్పందిస్తూ.. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో ఈ కేసు విచారణ పూర్తి చేసి నిందితుడికి శిక్షపడేలా అధికారులు చూడాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. మహిళలు, ఆడ పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ ఘటనపై హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో నాలుగు బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టి నిందితుడు విఘ్నేష్ ను అరెస్ట్ చేశారని తెలియజేశారు.

========================

విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎలమంచిలిలో ఈ రోజు జరిగిన "ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ విధులతో పాటు సమాజ సేవ చేయడం ప్రసంసనీయమన్నారు.

రక్తదాన శిబిరాలు, ఉపాధ్యాయ ఉద్యోగార్థులకు శిక్షణ, విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించడం వంటివి వారి సేవలకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం గతంలో తీసుకువచ్చిన 117 జీవోను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలు ఒకేచోట ఉండేలా విద్యా విధానంలో మార్పు తీసుకొచ్చామని మంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

అమరావతిలో CRDA కార్యాలయ భవన పనులతో రాజధాని నిర్మాణం తిరిగి ప్రారంభం కావడంపై పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈ రోజు సామాజిక మాధ్యమం వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. దీనిని అమరావతి పునర్నిర్మాణం కంటే... పునరుజ్జీవంగా భావిస్తున్నట్లు తెలిపారు. తాను కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పనకు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించామని గుర్తు చేశారు. రాజధానిగా అమరావతి నిర్మాణం పూర్తయి దేశానికి రాష్ట్రం ఆదర్శం కావాలని, కర్నూల్ లో హై కోర్టు బెంచ్ ఏర్పాటు కావాలని ఆయన ఆకాంక్షించారు.

========================

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో  భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే  అతిసార వ్యాధి వ్యాప్తి చెందిందని ప్రాథమికంగా గుర్తించామని సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ బి ఆర్ అంబేద్కర్, వైద్య, ఆరోగ్య సంచాలకులు పద్మావతితో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్న ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. అతిసారను గుర్తించగానే ప్రభుత్వం అప్రమత్తమై, వ్యాధి నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందన్నారు. సుమారు 201 మందిలో అతిసార లక్షణాలు కనిపించగా, వెంటనే వారికి చికిత్సను అందించామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

========================

ఉత్తర అండమాన్ సముద్రం మీదగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్న నేపథ్యంలో రాగల 24 గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీనిపై వాతావరణ శాఖ అధికారి ఆ వివరాలను తెలియజేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

========================

“ప్రజాదర్బార్”లో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ రోజు అనంతపురం నగరంలో నిర్వహించిన "ప్రజాదర్బార్" లో మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.  ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

========================

గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం రాంపురం పంచాయతీ మరువపల్లి గ్రామంలో ఈ రోజు పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాలలో అభివృద్ధిపథంలో నడిపి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని పేర్కొన్నారు.

========================

ఇటీవలే సంభవించిన వరదల్లో మచిలీపట్నం పురపాలక సంఘ పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ లో సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 5 లక్షల రూపాయలు విలువ చేసే యూనిఫార్మ్, భద్రతా మాస్కులను ఈ రోజు ఆయన పంపిణీ చేశారు. కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామని హామీ మంత్రి ఇచ్చారు.

========================

క్యాన్సర్ నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ రోజు రాజమహేంద్రవరంలో 5కె రన్ ను నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని, జెండా ఊపి ఈ పరుగును ప్రారంభించారు. క్యాన్సర్ నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.

========================

ఉత్తరాంధ్ర ప్రాంతానికి పూర్తి స్థాయిలో సాగు, తాగునీరు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ పనులను ప్రారంభిస్తున్నారని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా బూరుగుపల్లి, దొడ్డిపట్ల గ్రామాల్లో “పల్లె పండుగ” వారోత్సవాల్లో భాగంగా అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు ఈ రోజు శంకుస్థాపన చేశారు.

========================

========================